క్లుప్తంగా

వలంటీర్ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : పట్టణంలోని మున్సిపల్ వార్డులలో వార్డు వలంటీర్ నియామకానికి, అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో... పట్టణంలోని అమ్మచెరువుమిట్ట-2, ఎస్‌బీఆర్ స్ట్రీట్-1, సుభాష్‌రోడ్డు-2, శాస్త్రివీధి-2, దేవళంవీధి-1, బాకావానితోట-1, గాంధీపురం-1, ప్రశాంత్‌నగర్-1, నీరుగట్టువారిపల్లె-1, రామిరెడ్డిలేఔట్-3 మొత్తం 15వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వార్డు వలంటీర్ ఖాళీ లకు స్థానికులై ఉండి, 18 ఏళ్లు నిండి 35 సంవత్సరాలు మించకుండా, విద్యార్హత పదోతరగతి కలిగి ఉండాలన్నారు. పై అర్హతలు కలిగిన అభ్యర్థులు ఈనెల 13 తేదీలోపు వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వలంటీర్ల ఖాళీలను రిజర్వేషన్ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు.

రూ. 5 లక్షలతో ఆలయ ప్రహరీ నిర్మాణం

పీలేరు రూరల్ : స్థానిక చెన్నకేశవస్వామి ఆలయానికి రూ. 5 లక్షలతో ప్రహరీ నిర్మిస్తున్నట్లు ఆలయ ఈవో రవీంద్రరాజు తెలిపారు. సోమవారం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయానికి తూర్పున ఉన్న ప్రహరీ వర్షంతో పూర్తిగా దెబ్బతినడంతో రూ. 5 లక్షలతో నూతన ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మకర్త బాలన్న పాల్గొన్నారు.

క్రాకర్స్ లైసెన్స్‌కు 24 దరఖాస్తులు

ములకలచెరువు: ములకలచెరువు ఫైర్ కార్యాలయం పరిధిలో 24 మంది క్రాకర్స్ లైసెన్స్ కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు ఇన్‌చార్జ్ ఫైర్ అధికారి శివప్ప తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట - 05, ములకలచెరువు -10, తంబళ్లపల్లి - 03, పెద్దమండ్యం - 03,
పీటీయం - 03 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. స్థలాలను పరిశీలించి లైసెన్స్ మంజూరు చేస్తామని ఫైర్ అధికారి అన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు రెడ్డిప్రకాష్ ఎంపిక

కలికిరి: కలికిరిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి రెడ్డి ప్రకాష్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శారద, పీడీ ఆర్ముగం తెలిపారు. శనివారం తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ అండర్-17 విభాగం 1500 మీటర్ల పరుగు పందెంలో రెడ్డి ప్రకాష్ ప్రథమ స్థానంలో గెలుపొంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించి ఆటల పోటీలలో గెలుపొంది పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

అండర్-14 విభాగంలో..

కలికిరి: తిరుపతి జిల్లా తుమ్మలగుంటలో 4న జరిగిన ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలలో బాలికల విభాగం అండర్-14 వంద మీటర్ల పరుగు పందెంలో కలికిరి టి.చదివేవాండ్లపల్లి(ఇందిరమ్మ కాలని) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని ఇ.హాసిని ప్రతిభ చాటి ప్రథమ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం సంపత్ కుమార్ తెలిపారు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఎంఈఓ కరీముల్లా, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ చాటాలన్నారు.

విద్యార్థులకు కళ్లజోడు పంపిణీ

వాల్మీకిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కళ్ళజోడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కల్పన మాట్లాడుతూ విద్యార్థులకు కళ్ళజోడు పంపిణీ చేయడం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అనంతరం 28మందికి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐజీసీ-ఆర్‌డీసీ క్యాంపులో ఎన్‌సీసీ కేడెట్స్

పీలేరు రూరల్ : సికింద్రాబాద్‌లో జరిగిన ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్ - రిపబ్లిక్ డే క్యాంప్, న్యూ ఢిల్లీ (ఐజీసీ - ఆర్‌డీసీ) క్యాంప్‌లో పీలేరు ఎస్‌జీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొని ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఐజీసీ - ఆర్‌డీసీ క్యాంప్‌లో డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాల్లో కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ సీనియర్ అండర్ ఆఫీసర్ తేజ, జేయూవో నిషార్, కేడెట్ వంశీ, బాలాజీ, ఆదర్శ్ విశేష ప్రతిభ కనబరచినట్లు చెప్పారు.

సారా సీజ్-వ్యక్తి అరెస్ట్

కలకడ: మండలంలో 12 లీటర్ల సారా సీజ్ చేసి వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. సోమవారం దిగువతాండ అటవీప్రాంతంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు ఎస్ఐ తనసిబ్బంది హరి, ప్రతాప్, రమేష్‌లతో కలిసి దాడిచేశారు. దిగువతాండకు చెందిన బుక్కే వెంకటరమణనాయక్ గ్రామం సమీపంలోని ధామరగుట్టవద్ద సారా తయారు చేసి ఉండగా సారా ఊటను ధ్వంసం చేసి అతని వద్ద విక్రయించడానికి సిద్ధంగా ఉన్న 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయం

- ప్రజల నమ్మకాన్ని నిలుపుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రజాసంకల్పపాదయాత్రకు ఆరు వసంతాలు పూర్తి
- మహానేత విగ్రహానికి నివాళులు
- కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్న నాయకులు, కార్యకర్తలు


తట్టివారిపల్లెలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : పేదల కష్టాలు తెలుసుకునేందుకు వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేసిన ప్రజాసంకల్ప యాత్ర రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికిందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం ప్రజాసంకల్ప పాదయాత్ర ప్రారంభమై ఆరు వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేడుకలు జరుపుకున్నారు. మండలంలోని తట్టివారిపల్లెలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా పూలమాల వేసి నివాళులర్పించారు. తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...2017 నవంబర్ 6న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రారంభమైన ప్రజాసంకల్ప పాదయాత్ర ఇచ్ఛాపురం వరకు మొత్తం 13 జిల్లాలను టచ్‌చేస్తూ సాగిందన్నారు. 134 నియోజకవర్గాల్లో 341 రోజులపాటు 3,648 కి.మీ.లు సాగిన సుదీర్ఘపాదయాత్రలో పేదల కష్టాలు, వారి ఇబ్బందులను క్షేత్రస్థాయిలో నేరుగా పరిశీలించడమే కాకుండా, వారిచ్చిన సలహాలు, సూచనలతో నవరత్నాల పేరుతో మేనిఫెస్టో రూపొందించారన్నారు. అన్నివర్గాలకు న్యాయం జరిగేలా ప్రణాళిక రూపొందించారన్నారు. మాట ఇస్తే తప్పనని చెప్పి ప్రజల విశ్వాసాన్ని చూరగొని రాష్ట్ర చరిత్రలోనే ఇప్పటివరకు మరే పార్టీకి రానివిధంగా 151 సీట్లతో విజయకేతనం ఎగురవేసి రికార్డులు బద్దలు కొట్టారన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటిరోజు నుంచి ఇప్పటివరకు ప్రజలకు ఇచ్చిన హామీలు, విశ్వసనీయత నిలుపుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తూనే ఉన్నారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని ప్రజల గడప వద్దకే తీసుకువచ్చి పారదర్శక పాలన అందిస్తున్నారన్నారు. ఐదునెలల్లో ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు, దత్తపుత్రుడితో కలిసి ప్రజలను ఏమార్చేందుకు వస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ, డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలుగుచంద్ర, గుండ్లూరు రఫీ, ఎస్.ఇర్ఫాన్‌ఖాన్, షరీఫ్, జేసీఎస్ కన్వీనర్ మునిశేఖర్, బావాజీ, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు, బెల్లేప్రసాద్, రాయల్‌రవీంద్ర, రహీం, కౌన్సిలర్లు ఆర్.వి.శివారెడ్డి, డిష్‌రామకృష్ణారెడ్డి, ఎస్వీ.రమణ, వసీం, రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, రేణుక, వినుతాభాయి తదితరులు పాల్గొన్నారు.

కలికిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్పయాత్రకు ఆరేళ్ళు పూర్తయిన సందర్భంగా కలికిరిలో వైఎస్సార్‌సీపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజా సమస్యలను గుర్తించిన జగన్ మోహన్ రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టి పేద సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ సతీష్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడీ హరి, ఎంఐ హనీఫ్, ఎస్‌పీఎస్ అల్తాఫ్, నరేష్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న సీఎం కావాలన్నదే ప్రజల ఆకాంక్ష

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: జగనన్న మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, ఇందుకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి లభిస్తున్న అనూహ్య స్పందనే కారణమని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం వాల్మీకిపురం పంచాయతీ ఫత్తేపురం, శివపురం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రానివారు తమదృష్టికి తీసుకురావాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలేకాక ఇవ్వనివి కూడా అమలు చేశారన్నారు. జగనన్న పాలనలో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి రైతుకు ఏటా రూ.13,500 పెట్టుబడి సాయం అందజేస్తున్నారని గుర్తు చేశారు. గృహ నిర్మాణ పథకం ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్బీకేల ద్వారా విత్తనాల నుంచి పంట అమ్మకాల వరకు అన్ని సేవలు లభిస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాల అమలు, రూపాయి లంచం లేకుండా నేరుగా అర్హులకే చేరే విధానం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. అన్నివర్గాల వారికి మంచి చేస్తూ వస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అందరి గుండెల్లో కొలువై ఉన్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఈవో ఉదయ్ కుమార్, సర్పంచ్ గంగులమ్మ, నాయకులు చింతల ఆనంద రెడ్డి, చింతల శివానంద రెడ్డి, కేశవ రెడ్డి, మధనమోహన్ రెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, రాయుడు, ఆనంద, నరసింహులు, రఘు, షాహెద్, రవి, శివారెడ్డి, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

మదనపల్లె : ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ ప్రతి కుటుంబం వద్దకు వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను పంపించి, చికిత్సలు అందించేందుకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని 22వవార్డు సచివాలయ పరిధిలో స్థానిక జెడ్పీహైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవాజ్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై, ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కార్యక్రమం ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నది లేనిదీ వారి నుంచే అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహానేత వైఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే, ఇప్పుడు సీఎం వైఎస్.జగన్ నాయకత్వంలో ఆరోగ్యసురక్ష ద్వారా అధ్వానంగా ఉన్న ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోశారన్నారు. 2024లో ముఖ్యమంత్రిగా జగనన్నను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకావెంకటాచలపతి, కమిషనర్ కే.ప్రమీల, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ, ఏఈ బండపల్లిశిరీషా, 22వవార్డు ఇన్‌చార్జ్ షరీఫ్, కౌన్సిలర్లు... రేణుక, ఈశ్వర్‌నాయక్, రామిశెట్టి శివయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోరువానలోనూ గడప గడపకు మన ప్రభుత్వం

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లె-2 పంచాయతీ దుబ్బిగానిపల్లెలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జోరువానను సైతం లెక్కచేయకుండా నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా వర్షంలో తడుస్తూనే, ప్రతి గడపకు వెళ్లి పేరు పేరునా అప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాలుగన్నరేళ్ల పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరిస్తూ ప్రజల ఆశీర్వాదాలు పొందారు. స్థానిక సమస్యలు ఏమైనా ఉంటే తెలపాలని కోరుతూ...వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వెలుగుచంద్ర, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, మండల కన్వీనర్ దండు కరుణాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజ, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి నిరుపేదకు ఇంటి స్థలం


ఇంటిస్థలాల కోసం భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్, కమిషనర్

బి.కొత్తకోట: ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషితో బి.కొత్తకోట నగర పంచాయతీకి చెందిన నిరుపేదలకు ఇంటి నివేశ స్థలాల మంజూరుకు అధికారుల చర్యలు వేగవంతం అయ్యాయి. సోమవారం బి.కొత్తకోట-బీరంగి గ్రామాల మధ్య ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిని తహసీల్దార్ ఎస్.రఫీక్ అహ్మద్, కమిషనర్ పీఆర్.మనోహర్, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణి, సిబ్బంది పరిశీలించారు. ఇంటిస్థలాలకు అనువైది కావడంతో ఏకాభిప్రాయానికి వచ్చారు. ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం, సాధారణ గ్రామ పర్యటనల్లో ప్రజల నుంచి ఇంటిస్థలాల కోసం వినతులు అందాయి. వీటిని క్షుణ్ణంగా పరిశీలించిన రెవెన్యూ, మున్సిపల్, హౌసింగ్ అధికారులు 1,200 మంది అర్హులు ఉన్నారని, వీరికి ఇంటినివేశిత స్థలాలను మంజూరు చేయాల్సివుందని నిర్ణయించారు. దీనిపై కొంత కాలంగా అధికారులతో ఎమ్మెల్యే కసరత్తు చేస్తున్నారు. పేదలకు ఇంటిస్థలాలను కేటాయించడం కోసం ఉన్నతాధికారులను కలిసి విన్నవించారు. ఇప్పటికే నవ రత్నాలు-పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో బి.కొత్తకోట నగర పంచాయతీకి చెందిన 1,227 మంది పేదలకు ఇళ్లను, పక్కా గృహాలను మంజూరు చేశారు. సర్వే నంబర్ 59లో ప్రభుత్వ భూమిని అధికారులు గుర్తించారు. ఈ భూమి పేదల ఇళ్ల నిర్మాణాలకు అనువుగా ఉండటం, విలువైన భూమి కావడంతో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వోచ్చని నిర్ణయించారు. ఈ భూమిలో కొందరికి పట్టాలు ఇవ్వగా మిగిలిన 18 ఎకరాల్లో 1,200 మందికి పట్టాలు ఇవ్వడానికి సరిపోతుందని మూడెకరాలను సామాజిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చని నిర్ణయించారు. ఈ భూమిలో ఇంటిస్థలాల కేటాయింపుతో నగర పంచాయతీలో ఇంటిస్థలాలు లేని పేదలు దాదాపుగా లేనట్టే.

సామాజిక బస్సుయాత్ర విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె: నియోజకవర్గంలోని పీటీఎం నుంచి ఈనెల 10వతేదీ ప్రారంభమయ్యే జగనన్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి కోరారు. సోమవారం ఎంపీపీ ఛాంబర్‌లో ప్రజాప్రతినిధులతో చర్చా సమావేశం నిర్వహించారు. ములకలచెరువులో జరిగే బస్సుయాత్ర బహిరంగసభ నిర్వహణ, జనసమీకరణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు చౌడేశ్వర్, సింగల్ విండో చైర్మన్ భార్గవరెడ్డి, నాయకులు రామమూర్తి, మల్లికార్జున, శివారెడ్డి, నరేంద్రరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

టమాట బాక్సు రూ.700



ములకలచెరువు: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో టమాట ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి. సోమవారం మార్కెట్‌కు వచ్చిన నాణ్యమైన 30 కేజీల టమాట బాక్సు రూ.600 నుంచి రూ. 700 వరకు పలికాయి. ప్రతి రోజూ ఇక్కడి నుంచి 20 లారీల టమాటాలు ఎగుమతి అవుతున్నట్లు మండీ యజమానులు తెలిపారు.

పాలస్తీనాకు మద్దతుగా శాంతి ర్యాలీ


మానవహారం నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

కలికిరి: స్వతంత్ర్య పాలస్తీనాకు మద్దతుగా కలికిరిలో ముస్లిం సోదరులు ర్యాలీ నిర్వహించారు. గాజాపై ఇజ్రాయిల్ యుద్ధనీతికి వ్యతిరేకంగా సామాన్య ప్రజలు, మసీదులు, పాఠశాలలపై దాడులు చేసి వేల మంది సామాన్య ప్రజలు, చిన్నారుల మరణాలకు పాల్పడుతోందన్నారు. మెయిన్ బజారు మసీదు నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీ, అక్కడ మానవహారం నిర్వహించారు. హింసను ఆపాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జమియత్ ఉల్మా ఎ హింద్ జిల్లా జనరల్ సెక్రెటరీ ఎండీ ముస్తఫా హజరత్, హఫీజ్ సయ్యద్, జాఫర్ హజరత్, మహబూబ్ బాషా, ఫైజాన్, కరీముల్లా, అలీ, వలివుల్లా తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

మదనపల్లె సిటీ: వాసవీ క్లబ్ ద్వారా మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలు చేపట్టాలని వాసవీక్లబ్ ఇంటర్‌నేషనల్ పూర్వపు గవర్నర్ ఐతేరాములు అన్నారు. సోమవారం వాసవీక్లబ్ హనీషా డిస్కాన్ 2ఔ 23 కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఇటీవల చిత్తూరు రోడ్డులో బస్ షెల్టర్ ఏర్పాటు చేశామన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వారికి రుణాలు మంజూరు చేయడం, అందరి సహకారంతో క్లబ్ మరిన్ని కార్యక్రమాలు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ అధ్యక్షులు నరేంద్రకుమార్, కార్యదర్శి అశోక్‌కుమార్, కోశాధికారి లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా పారిశుధ్య పనుల నిర్వహణ

బి.కొత్తకోట: ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని నగర పంచాయతీలో పారిశుధ్య నిర్వహణ పనులు పక్కాగా అమలు చేస్తున్నామని కమిషనర్ పీఆర్.మనోహర్ అన్నారు. సోమవారం ఆయన పట్టణానికి చెందిన చెత్తను నిల్వ చేస్తున్న చలిమామిడిరోడ్డులోని డంపింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. ట్రాక్టర్ల ద్వారా చెత్తను తరలించి 10 ఎకరాల్లోని మైదానమంతా నింపేయడంపై పరిశీలించి సరైన చర్యలకు సూచనలు చేశారు. చెత్తను ఒకవైపుగా నిల్వ చేస్తూ రావాలని, డంపింగ్ ప్రదేశమంతా వ్యాపించకుండా చూడాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. ఆయనవెంట ఏఈ రాజేంద్ర, సిబ్బంది తదితరులు ఉన్నారు.

26న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

మదనపల్లె సిటీ: కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 26న అరుణచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ-2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. పల్లె వెలుగు బస్సుకు రాను, పోను చార్జీ రూ.570, అల్ట్రాడీలక్స్ రూ.805, ఎక్స్‌ప్రెస్ రూ.670 చెల్లించాలన్నారు. భక్తులు ముందుగానే టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9959225677, 9550655816ను సంప్రదించాలన్నారు.

పకడ్బందీగా జలాశయాల గణన చేపట్టిండి


మాట్లాడుతున్న తహసీల్దారు భీమేశ్వరరావు

కురబలకోట: చెరువులు,కుంటలు, చెక్‌డ్యాంలు తదితర జలాశయాల గణన పకడ్బందీగా చేపట్టాలని కురబలకోట తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, ఆర్ఐలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనాభా, జంతు, పశుగణన లాగా ఇక వివిధ జలాశయాల స్థితిగతులపై పక్కాగా సర్వే నిర్వహించి యాప్‌లో నమోదు చేయాలన్నారు. చెరువు దాని వైశాల్యం, యాజమాన్యం, స్థితిగతులు, సాగు, తాగునీటి అవసరాలు, ప్రయోజనం, వినియోగం, ఆయకట్టు, ఆక్రమణలు, ఉపయోగంలో లేనివి తదితర వాటిపై సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. నీరు ఉంటేనే ఊరు, ఉనికి సాధ్యమన్నారు. మానవ మనుగడకే కాకుండా వృక్ష జంతుజీవాలకు నీరు ప్రధానమన్నారు. జలశయాల గణన బాధ్యతగా చేపట్టాలన్నారు.

రెడ్డెమ్మకొండ ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాతలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రెడ్డెమ్మకొండ ఆలయ పునర్నిర్మాణానికి వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంకు చెందిన మేరువ వెంకటేశ్వరరావ్, సుజాత దంపతులు రూ.25,116 విరాళంగా అందజేశారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన దాతలకు ఆలయ ఈఓ మంజుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. దాతలు ఇచ్చిన మొత్తాన్ని వాల్మీకిపురం సప్తగిరిగ్రామీణ బ్యాంకులో జమ చేయనున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

జగనన్న లేఅవుట్‌కు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న నాయకులు

పీలేరు : పీలేరు పట్టణంలో నాలుగో విడత ఇళ్ల స్థలాల పంపిణీకి స్థానిక మదనపల్లె రోడ్డు మార్గంలో ఏపీఐఐసీ లేఅవుట్-4లో జగనన్న కాలనీకి భూమి పూజ చేశారు. సోమవారం ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి భూమి పూజ చేసి స్థలాన్ని చదును చేసే పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగో విడత 2వేల ఇంటి పట్టాలు పంపిణీకి గానూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మరో 65 ఎకరాలు చదును చేసి త్వరలో పట్టాలు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్, ఎంపీటీసీ చెంగల్‌రాయుడు, నాయకులు ఆనంద్, ఉదయ్, కాలనీ చిన్న, జావిద్, షాకీర్, నాగార్జున, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కేవీపల్లె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎంఈఓలు రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాల వచ్చే సమస్యలపై విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేసుకోవడం ద్వారా ఆరోగ్య, మానసిక, ఆర్థిక సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తే 112, 1098 లాంటి ఉచిత కాల్ సెంటర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే వగల్ల కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయంలో సీడీపీవో రాజమ్మ బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు.

వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా సురేష్‌బాబు

పీలేరు : వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా పీలేరుకు చెందిన సోమిశెట్టి సురేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేశారు. రామతులసి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన హనీషా డిస్కాన్ 2023 కార్యక్రమంలో భాగంగా వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి 211ఏ, 2024 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా సురేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల విస్తృతం చేస్తానని తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెబాట

మదనపల్లె : మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యవైఖరికి నిరసనగా ఈనెల 20వ తేదీ నుంచి సమ్మెబాట పట్టనున్నామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ కుమార్, నాగరాజు తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలో జరుగుతున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సమ్మెకు సంబంధించిన నోటీసును డీఈ శ్రావణికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని కార్మికుల సమస్యపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించామన్నారు. ఎస్‌బీఐ కాలనీ, నీరుగట్టువారిపల్లెలో మస్టర్ రూములు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అలాగే డైలీ వేజెస్ కార్మికులకు సంబంధించి 45రోజుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, తోపుడు బండ్లు ఇవ్వాలని పలుమార్లు వినతులు చేసినా నేటికీ పరిష్కారం కాలేదన్నారు. మున్సిపల్ కౌన్సిల్‌లో ఆమోదం పొందినప్పటికీ కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ అందలేదన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కారానికి 15 రోజులు ముందుగా నోటీసు ఇస్తున్నామని, అప్పటిలోపు పరిష్కారం కాకపోతే 20వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని తెలిపారు. కార్యక్రమంలో మధు, శంకర్, ప్రసాద్, లోకేష్, పుష్ప, సలీమాబీ, శేఖర తదితరులు పాల్గొన్నారు.